నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
13 | హైదరాబాద్, గురువారం 8 ఫిబ్రవరి 2024 | RANGAREDDY



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

# బీసీల్లో ఐక్యతకు నాంది పలకాలి

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి**

- బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి, బీసీ కులగణన చేపట్టాలి
- అసెంబ్లీలో జ్యోతి రావుపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి
- ఈ నెల 12న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా
- యునైటెడ్ పూలే ఫ్రంట్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న బీసీ ప్రజాప్రతినిధులు, నాయకులు

వికారాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : బీసీ ఉద్యమంలో వికారాబాద్ అగ్రస్థానంలో ఉండాలని, బీసీల ఐక్యతకు ఇక్కడి నుంచే నాంది పలకాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని నర్సింగ్ ఫంక్షన్‌హాల్‌లో బీసీ హక్కుల సాధన కోసం యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ అన్ని వైపుల నుంచి ఒత్తిడి తీసుకువచ్చి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీలకు నిర్ణయాధికారం వచ్చేవరకు పోరాడుదామన్నారు. ఐక్యతతో ఉంటేనే బీసీలు హక్కులు సాధిస్తారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ చేయాలన్నారు. నేటి నుంచి జరిగే బడ్జెట్ సమావేశాల్లో ప్రత్యేకంగా బీసీలకు ఏటా రూ.20 వేల కోట్లను కేటాయించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే జరిగితే రాష్ట్రవ్యాప్తంగా 23,973 మంది బీసీలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, జడ్పీటీసీలు అవుతారన్నారు. దశాబ్దాల క్రితం చేపట్టిన కులగణనలో 4300లకు పైగా కులాలున్నాయని లెక్కతేల్చారని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మాత్రం దేశంలో 2400 కులాలున్నాయని చెబుతున్నదన్నారు. అసలు ఎన్ని కులాలున్నాయనేది స్పష్టత లేదని, తప్పనిసరిగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. పులులు, పిట్టలు, నెమళ్లను లెక్కపెడుతున్నారు కానీ మనుషులను లెక్కపెట్టడం లేదని, తక్షణమే బీసీ కులగణన ప్రక్రియను చేపట్టాలన్నారు. అదేవిధంగా మహాత్మజ్యోతి రావుపూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు ఈ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. ఏప్రిల్ 11న జ్యోతిరావుపూలే 111వ జయంతి అని, ఆలోగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు డిమాండ్ చేస్తూ ఈ నెల 12న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నామన్నారు. దేశవ్యాప్తంగా బీసీ నేతలు వస్తున్నారని, ప్రతీ బీసీ బిడ్డ తరలిరావాలని పిలుపునిచ్చారు. 2018 నుంచి ఇప్పటివరకు యూపీఎస్సీ పరీక్షలో 4365 మంది ఉత్తీర్ణులుకాగా, వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు కేవలం 1195 మంది ఉన్నారన్నారు. ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ ఉన్నా కేవలం 15.5 శాతం మందిని మాత్రమే ఎంపిక చేశారన్నారు. ఎస్సీలు 5 శాతం ఎస్టీలు 3 శాతం మాత్రమే ఎంపికయ్యారని తెలిపారు. వెనుకబడిన వర్గాల వారు కోల్పోతున్న రిజర్వేషన్లపై ఎవరూ మాట్లాడడంలేదని, బీసీ మేధావులు ఈ అంశంపై గళమెత్తాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన రూ.26 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.5 వేల కోట్లను మాత్రమే కేటాయించిందన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కూడా కాపాడుకోలేకపోతున్నామని, చదువు, రాయు, సాధించు నినాదంతో బీసీ హక్కుల సాధనకు ముందుకు పోదామన్నారు. అదే విధంగా ఓబీసీ అని చెప్పుకుంటున్న మోదీ తన మంత్రివర్గంలో బీసీ శాఖ మంత్రి లేకపోవడం శోచనీయమన్నారు. మరోవైపు 2006లో తెలంగాణ జాగృతి సంస్థను ప్రారంభించి అనేక సామాజిక, విద్యా, రాజకీయ అంశాలను తీసుకొని విజయం సాధించామని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో తెలంగాణవాదాన్ని గట్టిగా వినిపించామని, బతుకమ్మ పండుగను ప్రభుత్వం అధికారికంగా జరపడంలో జాగృతి కీలకమన్నారు. అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిరాహార దీక్ష చేసి సాధించామన్నారు. మహిళా బిల్లు కోసం పోరాటం చేశామని, రాష్ట్రంలో 15 స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎంతో మంది యువతకు ఉపాధి కల్పించామని వెల్లడించారు.

### బీసీల హక్కులు సాధించే వరకూ పోరాడుదాం..



మహాత్మజ్యోతిరావు పూలే ఆశయమైన బీసీల హక్కులను సాధించేవరకు పోరాడుదామని యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచంద్రరావు పిలుపునిచ్చారు. బీసీల్లోని 80-85 కులాలకు సంబంధించి కనీస ప్రాతినిధ్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల్లోని అన్ని సంఘాలను కలుపుకొని ముందుకుపోతామన్నారు. సమాజానికి నాగరికత నేర్పిందే బీసీ కులాలన్నారు. ఏప్రిల్ 11 నాటికి పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. బీసీ ఉద్యమాన్ని పార్టీలకు అతీతంగా ముందుకు తీసుకుపోదామన్నారు. బీసీల హక్కుల సాధనతోపాటు పూలే విగ్రహ ఏర్పాటుకుగాను గ్రామాల్లో పోస్ట్ కార్డులు, గ్రామ పంచాయతీలు, మండలాలు, జడ్పీల్లో తీర్మానాలను చేయాలన్నారు.

### మహాధర్నాను విజయవంతం చేద్దాం



బీసీల హక్కుల కోసం చేపడుతున్న మహాధర్నాకు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేద్దామని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. బీహార్‌లో కులగణన చేపడితే 63 శాతం ఉన్నారని లెక్కతేలిందని, తెలంగాణలోనూ 70 శాతం బీసీలుంటారన్నారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే అధిక శాతం ఉన్న బీసీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

# పూల సిరులు

**జెర్బరా పూలసాగుతో ప్రత్యేకతను చాటుకుంటున్న చేవెళ్ల మండలంలోని పల్లెలు**

**మార్కెట్లో మంచి డిమాండ్**

**రూ.లక్షల్లో ఆదాయాన్ని ఆర్జిస్తున్న రైతులు**

**శుభకార్యాలు, ఫంక్షన్లకు కొత్త శోభను తెస్తున్న జెర్బరా పూలు**

రంగారెడ్డి, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : ఫంక్షన్లు.. ప్రారంభోత్సవాలు.. ఏ శుభ కార్యంలోనైనా అలంకరణకు 'జెర్బరా' పూలు ఉండాల్సిందే. ఒకప్పుడు మహారాష్ట్ర, కర్ణాటక, పూణే ప్రాంతాల్లోనే సాగైన ఈ పూలు ప్రస్తుతం తెలంగాణలోనూ సాగవుతున్నాయి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని అనేక పల్లెలు ఈ పూల సాగునే చేపడుతున్నాయి. పాలీ హౌస్‌లలో ఈ తోటల సాగుకు గత కేసీఆర్ ప్రభుత్వం రాయితీలు కల్పించడంతో రైతాంగం జెర్బరా పూల సాగును చేపట్టి రూ.లక్షల్లో లాభాన్ని ఆర్జిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

**సిరులు కురిపిస్తున్న పూల సాగు..**

చన్వెల్లి, గుండాల, ఇక్కారెడ్డిగూడ, కందవాడ, పామేనా, కమ్మేట, దేవునిఎర్రవెల్లి గ్రామాల పరిధిలో 62 ఎకరాల్లో జెర్బరా పూల తోటలను స్థానిక రైతులు సాగు చేస్తున్నారు. కేవలం చన్వెల్లి, ఇక్కారెడ్డిగూడ గ్రామాల పరిధిలోనే 44 ఎకరాలు సాగవుతున్నది. ఐదు, ఆరు విభిన్న రంగుల్లో సాగవుతున్న ఈ పూలు రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. సాధారణ పంటల్లో నష్టాలు వచ్చినప్పటికీ పూల సాగు ఆర్థికంగా రైతులు నిలదొక్కుకునేందుకు దోహదపడుతున్నది. పండుగలు, శుభ కార్యాల సందర్భాల్లో అటు రైతులు, ఇటు వ్యాపారులకూ లాభాల పంట పడుతున్నది. పూలను గుడి మల్కాపూర్ మార్కెట్‌లో విక్రయిస్తుండగా.. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు వ్యాపారులు తరలిస్తున్నారు. ఒక నెలలో ఏడెనిమిది దఫాలుగా పూల కోతను చేపట్టవచ్చు. అర ఎకరాకు 14 నుంచి 15 బాక్స్‌ల వరకు దిగుబడి వస్తుండగా.. ఒక్కో బాక్స్ రూ5వేల వరకు ధర పలుకుతున్నది. ఈ పూల సాగుతో ఏడాదికి రూ.20లక్షలు సంపాదిస్తున్న రైతులూ ఉన్నారు. జెర్బరా పూల సాగుతో కూలీలకు సైతం పుష్కలంగా ఉపాధి దొరుకుతున్నది.

**తోడ్పాటునందించిన కేసీఆర్ ప్రభుత్వం..**

జెర్బరా పూల సాగు చేయాలంటే ఒకప్పుడు ఆర్థికంగా ఉన్న రైతులకు మాత్రమే సాధ్యపడేది. పాలీ హౌస్‌లలో ఈ తోటల సాగును చేపట్టాల్సి ఉండడంతో టెంట్, స్ప్రింక్లింగ్, పెస్టిసైడ్స్, మొక్కల కొనుగోలు చేయడం ఖర్చుతో కూడుకున్న పని. అయితే కేసీఆర్ ప్రభుత్వం పాలీహౌస్‌ల ఏర్పాటుకు రాయితీలు కల్పించి ప్రోత్సహించింది. దీంతో చిన్న, సన్నకారు రైతులు సైతం జెర్బరా పూలను సాగు చేస్తున్నారు. కూరగాయలు, పండ్ల సాగుతో రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా ప్రత్యేకతను పొందగా.. పూల సాగులోనూ జిల్లా ప్రత్యేక గుర్తింపును పొందుతున్నది. ప్రతి సీజన్‌లోనూ జిల్లాలో 5 వేల ఎకరాల్లో పూల తోటలే సాగవుతుండగా.. ఏడాదికి 50వేల మెట్రిక్ టన్నుల వరకు పూల దిగుబడులు వస్తున్నాయి.

### ఏడాదికి రూ.15 లక్షల లాభం..



2016 సంవత్సరం నుంచి జెర్బరా పూలను సాగు చేస్తున్నాను. సాగు కోసం గతంలో కేసీఆర్ ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ ఇచ్చింది. పూలను కోసి రాత్రి ఒంటి గంటకు గుడిమల్కాపూర్ మార్కెట్‌కు వెళ్లి అమ్ముకుని వస్తా. ఖర్చులు అన్నీపోను ఏడాదికి రూ.15లక్షల వరకు ఆదాయం వస్తున్నది. జెర్బరా పూల సాగు మొదలు పెట్టిన తర్వాత రూ.40లక్షలతో ఇల్లు కూడా కట్టుకున్నాను. సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి వచ్చే సంపాదన వస్తుండడంతోపాటు మరో నలుగురైదురికి ఉపాధి కూడా కల్పిస్తున్నాను.

-ఎస్.మాణిక్య రెడ్డి, రైతు, దేవునిఎర్రవల్లి గ్రామం

### 12 ఏండ్లుగా పూలు సాగు..



వ్యవసాయంలో నష్టాలు రావడంతో జెర్బరా పూల సాగును మొదలు పెట్టిన. 12 ఏండ్లుగా పాలీహౌస్‌లో పూలను సాగు చేస్తున్న. తొలుత పావు ఎకరం లోనే సాగు చేసిన. లాభాలు బాగుండడంతో మరో ఎకరంలో ఆరేండ్లుగా పూల సాగును చేస్తున్న. మా కుటుంబంతోపాటు ఇద్దరు కూలీలతో నిత్యం పూల సాగును చూసుకుంటున్నాం. ఫంక్షన్లలో ఈ పూలను వినియోగించడం వల్ల మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంది. సీజన్‌ను బట్టి 6 లక్షల నుంచి 10 లక్షల వరకు సంపాదించుకుంటున్న.

-దావల్గారి అంజిరెడ్డి, రైతు, పామేనా గ్రామం



# ఈవీఎం, వీవీ ప్యాట్లను క్షుణ్ణంగా పరిశీలించాలి

**వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డి**

వికారాబాద్, ఫిబ్రవరి 7 : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం), వీవీ ప్యాట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో విజయకుమారితో కలిసి వికారాబాద్ పట్టణంలోని ఈవీఎం గిడ్డంగి, మార్కెట్‌యార్డులోని ఈవీఎం స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈవీఎంల మొదటి విడుత పరిశీలన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 14 వరకు నిర్వహించే ఈ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈసీఐఎల్‌కు చెందిన 12 మంది సాంకేతిక నిపుణుల బృందం ఈవీఎంల పనితీరును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నదన్నారు.



రికార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి




అబ్దుల్లాపూర్‌మెట్ : రోడ్డును శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

# రోడ్లు ఊడ్చి.. పూడిక తీసి..

**శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ షురూ**



వికారాబాద్ : మదన్‌పల్లి లో డ్రైనేజీని శుభ్రం చేస్తున్న కార్మికుడు..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ షురూ అయ్యింది. బుధవారం ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించడంతోపాటు పారిశుధ్య పనులు చేపట్టారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు వీధులు శుభ్రం చేయడం, ఓపెన్ నాలాల్లో పూడికతీత వంటి పనులు చేపట్టారు.

–న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



యాచారం : చౌదర్‌పల్లిలో..


# పోయింది వెయ్యే.. పోలీసులకెందుకు?

- సోషల్ మీడియాలో వ్యాపార ప్రకటనలు
- మహిళలను లక్ష్యంగా చేసుకొని మోసాలు
- తక్కువ మొత్తంలో ఎక్కువ మందిని లూటీ
- పోలీసులకు ఫిర్యాదు చేయని బాధితులు

**సైబర్ చీటర్స్‌కు కలిసొస్తున్న నయా దందా**

*ఇన్‌స్టాగ్రామ్, ఇతర సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో బిజినెస్ ప్రమోషన్ల పేర్లతో సైబర్ నేరగాళ్లు నయా మోసాలకు తెరలేపారు. సైబర్‌నేరగాళ్లు ఇప్పటి వరకు ఎన్నో రకాలుగా మోసాలు చేస్తూ కోట్ల రూపాయలు కొట్టేస్తున్నారు. కానీ ఇప్పుడు సోషల్ మీడియాలో సింపుల్‌గా మహిళలనే లక్ష్యంగా చేసుకొని చిన్న మొత్తాలలో దోపిడీ చేస్తున్నారు. తక్కువ మొత్తంలో ఎక్కువ మందిని మోసాలు చేస్తుండడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. ఇదే సైబర్‌నేరగాళ్లకు కలిసొస్తున్నది.*

*- సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ)*



ప్రస్తుతం ఏ వ్యాపార ప్రకటనలకైనా సోషల్ మీడియానే పదునైన ఆయుధం. రోడ్డుపై బండి నడిపే వారి నుంచి కార్పొరేట్ వ్యాపారాల వరకు ఇదే సూత్రం. దీనినే ఆసరాగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు తక్కువ ధరకు వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, బట్టలు, గృహోపకరణాలు విక్రయిస్తున్నామని ప్రకటనలు ఇస్తున్నారు. ఆయా ప్రకటనల కింద ఫోన్ నెంబర్, గూగుల్ పే, ఫోన్ పే నెంబర్లు ఇస్తూ కేవలం వాట్సాప్ కాల్స్‌లోనే మాట్లాడుతున్నారు. తక్కువ ధరకు ఇంటికి వస్తువులు డెలివరీ చేస్తామనగానే చాలా మంది మహిళలు రూ. 500, రూ. 1000, రూ. 1500 చెల్లిస్తున్నారు. డబ్బులు చెల్లించిన తరువాత ఆయా వస్తువులు ఇంటికి రావడం లేదు. దీంతో తాము మోసపోయామని గుర్తిస్తున్నారు. కొందరు వాట్సాప్‌లో మాట్లాడుతూనే రేపు ఎల్లుండి అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇంకొందరు మీరు కోరిన వస్తువు పంపించలేకపోతున్నాం..మీ డబ్బులో సగం తిరిగి పంపిస్తున్నామని మరో సగం నొక్కేస్తున్నారు. ఇలా చిన్న మొత్తాలలో ఒక్కొక్కరు మోసపోతుండడంతో ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. కానీ చిన్నమొత్తంలో ఎక్కువ మందిని లూటీ చేస్తూ సైబర్ నేరగాళ్లు ఆదాయాన్ని గడిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గుర్తుతెలియని వ్యక్తులు చెప్పే మాటలతో మోసపోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. వీలైనంత వరకు దగ్గర్లో ఉన్న దుకాణానికి వెళ్లి వస్తువులను తీసుకోవడం మంచిదని, అలాంటప్పుడే ఏదైనా పొరపాటు జరిగినా దుకాణదారుడిని ప్రశ్నించేందుకు అవకాశముంటుందని సూచిస్తున్నారు.

# రైల్వే స్టేషన్లలో డిజిటల్ చెల్లింపులు

**యూటీఎస్, టిక్కెట్ వెండింగ్ మిషన్‌తోపాటు అందుబాటులోకి యూపీఐ సేవలు**

సిటీబ్యూరో, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : డిజిటల్ కార్యకలాపాలు నిర్వహించడంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ ముందంజలో ఉందని మంగళవారం రైల్వే అధికారులు తెలిపారు. అందులో భాగంగా యూటీఎస్ మొబైల్ యాప్, ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ మిషిన్లు, పాయింట్ ఆఫ్ సేల్ మిషిన్లతో పాటు యూపీఐ చెల్లింపులు వంటి వాటిని ఎస్‌సీఆర్ ప్రవేశపెట్టడం వంటి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ మేరకు జోన్ పరిధిలోని అన్ని ముఖ్యమైన నాన్-సబర్బన్ స్టేషన్లు, 1-4, సబ్-అర్బన్ క్యాటగిరి స్టేషన్లలోని అన్ని ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్, అన్ రిజర్వ్‌డ్ టిక్కెటింగ్ సిస్టమ్ కౌంటర్లలోని పీవోఎస్‌తో పాటు యూపీఐ చెల్లింపుల విధానాన్ని ఏర్పాటు చేసింది.

### మేడారానికి సూపర్ లగ్జరీ బస్సులు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 7: మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు ఈ నెల 9 నుంచి ప్రతి రోజు టీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో మూడు బస్సులను నడుపుతున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంజీబీఎస్, జేబీఎస్‌ల నుంచి ప్రతి రోజు ఉదయం 6 గంటలకు, 6.30 గంటలకు, 7 గంటలకు మూడు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరి ఉప్పల్, హన్మకొండ, వరంగల్ మీదుగా మేడారానికి చేరుకుంటాయన్నారు.